# రైతుకే సీసీఐ 'మద్దతు'

- నాణ్యతా ప్రమాణాలతో పత్తి తీసుకురావాలి
- ప్రభుత్వ మద్దతు క్వింటాల్ ధర రూ.7020 పొందాలి
- మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి జీ రెడ్డినాయక్


సమావేశంలో మాట్లాడుతున్న సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జీ రెడ్డినాయక్

జమ్మికుంట, డిసెంబర్ 4: పత్తి రైతుకే సీసీఐ మద్దతు పలుకుతుందని, నాణ్యతా ప్రమాణాలతో కాటన్‌ను మార్కెట్‌కు తీసుకురావాలని సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి జీ రెడ్డినాయక్ సూచించారు. సోమవారం ఆయన జమ్మికుంట కాటన్ మార్కెట్ యార్డులో సీసీఐ అధికారి చంద్రశేఖర్‌తో కలిసి పత్తి కొనుగోళ్లను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో కూడిన పత్తిని సీసీఐ కోసం ఎంపిక చేశారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో విలేకరులతో కార్యదర్శి మాట్లాడారు. 2023-24 పత్తి సీజన్‌లో ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.7020 మద్దతు ధర ప్రకటించిందని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థకే రైతులు పత్తిని అమ్ముకొని మద్దతు పొందాలని సూచించారు. ప్రైవేట్‌కు అమ్ముకోవడం వల్ల క్వింటాల్‌కు రూ.600 వరకు నష్టపోయే అవకాశం ఉందని, రైతులు ఇది గమనించాల్సి ఉంటుందని తెలిపారు. సీసీఐకి అమ్ముకున్న రైతులకు కేవలం మూడు రోజుల్లోనే డబ్బులు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని చెప్పారు. అయితే సీసీఐకి అమ్ముకునే రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాసు పుస్తకం, రైతు ఆధార్ కార్డును బ్యాంకు ఖాతాకు లింకు చేసుకుని ఉండాలని తెలిపారు. 8-12 వరకు తేమతో వచ్చిన పత్తిని మాత్రమే సీసీఐ కొంటుందని, వాహనాల్లో విడి పత్తిని మాత్రమే తీసుకురావాలని కోరారు. తడిసిన, రంగు మారిన, నాణ్యత లేని పత్తిని సీసీఐ కొనదని చెప్పారు. మార్కెట్‌కు వచ్చిన ప్రతి రైతుకూ సీసీఐ కేంద్రాలకు వెళ్లాలని అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. జమ్మికుంటలో సీసీఐ ఏడు మిల్లుల్లో కొనుగోలు చేస్తున్నదని, సరిపడా పత్తి రాకపోవడంతో కేవలం మూడు మిల్లుల్లోనే కొంటున్నారని తెలిపారు. గత నెల 6న సీసీఐ కొనుగోలు ప్రారంభించిందని, ఇప్పటి వరకు 3వేలలోపు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసిందని చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు 30వేల క్వింటాళ్లకు పైగా కొన్నారని తెలిపారు. ప్రైవేట్ వ్యాపారుల కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని, ఇబ్బందులు పడిన రైతులు ఫిర్యాదులు చేయాలన్నారు. ఇక్కడ సీసీఐ అధికారి చంద్రశేఖర్‌తో పాటు గ్రేడ్-2సెక్రటరీ రాజ, సూపర్‌వైజర్లు యాకయ్య, లక్ష్మణ్, సిబ్బంది బాబా, తదితరులున్నారు.


కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినీరెడ్డిని సత్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్లు, నాయకురాళ్లు

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి నేతల ఘన సన్మానం

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 4: హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పాడి కౌశిక్‌రెడ్డి మొదటి సారిగా సిటీ సెంట్రల్ హాల్‌కు రాగా, ఆయనకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. కాగా, తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన వారందరికీ కౌశిక్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆయన సతీమణి శాలినీరెడ్డి, కూతురు శ్రీనికారెడ్డిని కూడా అభిమానులు, నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్, సింగిల్ విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దాసరి రమణారెడ్డి, మండల, పట్టణ శాఖల అధ్యక్షులు సంగెం ఐలయ్య, కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు రమాదేవి, లావణ్య, జీవిత, సుశీల, ఉమాదేవి, మంజుల, టీ శ్రీనివాస్‌గౌడ్, పీ తిరుమల్‌రెడ్డి, జీ ఉమామహేశ్వర్, టీ సదానందం, వీ కిషన్, బీ యాదగిరినాయక్, కుమార్‌యాదవ్, ముత్యంరాజు, నాయకురాళ్లు గొడిశాల పావని, ప్రభావతిరెడ్డి, పూలుగు లతారెడ్డి, కొయ్యడ శ్రీదేవి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ వార్డుల అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కౌశిక్‌రెడ్డి గెలుపుతో సమ్మక్క సారక్కకు మొక్కులు


మేడారంలో మొక్కులు చెల్లించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 4: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఎన్నికల్లో గెలుపొందగా మున్సిపల్ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం మేడారం సమ్మక్క సారక్కను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన ఐదేళ్లపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చూడాలని సమ్మక్క సారక్కను వేడుకున్నట్లు వారు తెలిపారు. మొక్కులు చెల్లించిన వారిలో పదో వార్డు కౌన్సిలర్ గోవిందుల స్వప్నాభాస్కర్, బీఆర్ఎస్ నాయకులు కళ్లెపు అఖిల్, రాజు, అజయ్, శ్రీనివాస్, రాజిరెడ్డి, మహేందర్, ఫణీంద్ర, రాము, లక్ష్మణ్, శ్రీను, అరవింద్ ఉన్నారు.

### 'కార్యకర్తలు అధైర్యపడొద్దు'

సైదాపూర్, డిసెంబర్ 4: కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య ఒక ప్రకటనలో సూచించారు. రానున్న రోజుల్లో పార్టీకి మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ వెన్నంటి ఉండి పార్టీ కోసం పనిచేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

తిమ్మాపూర్, డిసెంబర్ 4: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన పాలెపు సత్తయ్య(60) ఆదివారం సాయంత్రం నుస్తులాపూర్ స్టేజీ సమీపంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో సత్తయ్య కింద పడడంతో గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు, పోలీసులు 108అంబులెన్సులో కరీంనగర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా రాత్రి మరణించాడు. సత్తయ్య అల్లుడు దొంత శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

**వ్యవసాయ పనులకు వెళ్లి రైతు..**

వీణవంక, డిసెంబర్ 4: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతు గాజుల రాములు (57) గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు కథనం ప్రకారం వివరాలు.. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గాజుల రాములు సోమవారం ఉదయం నారుమడి సిద్ధం చేయడానికి పొలం వద్దకు వెళ్లాడు. నారుమడికి ఒడ్డుపెడుతుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చుట్టు పక్కల రైతులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. గాజుల రాములు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా, జిల్లా నాయకుడిగా మాదిగల రిజర్వేషన్ల కోసం ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నాడు. ఆయనకు భార్య తిరుపతమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 4: దివ్యాంగులైన పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని నింపి అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ సూచించారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సోమవారం మహాత్మానగర్‌లోని మానసిక వికలాంగుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి వెంకటేశ్ మాట్లాడుతూ, మానసికంగా వికలాంగులైన విద్యార్థులు డ్యాన్స్, యోగా వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు, వారికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రోజాదేవి, అడ్మినిస్ట్రేటర్ బీ బాలరాజు, అడ్వకేట్ మహేశ్ పాల్గొన్నారు.

## కూలీలకు అధిక పని దినాలు కల్పించాలి

**అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి**

శంకరపట్నం, డిసెంబర్ 4: ఈజీఎస్‌లో ఉపాధి కూలీలకు అదనపు పని దినాలు కల్పించేలా చూడాలని అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ఆయా గ్రామ పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించి కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న పనులు, వాటి వివరాలపై ఆరా తీశారు. అంతకుముందు ఆమె కాచాపూర్, రాజాపూర్, మొలంగూర్, ఆముదాలపల్లి గ్రామాల్లో వన నర్సరీలను సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీవాణి, ఏపీవో శారద, ఈసీ అంజయ్య, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి


క్రీడా జ్యోతి వెలిగిస్తున్న రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, డిసెంబర్ 4: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో మెగా స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దారుఢ్యానికి దోహద పడుతాయన్నారు. విద్యార్థులు నిత్యం తరగతి గదులకే పరిమితం కాకుండా క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వారం పాటు కొనసాగే మెగా స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు బహుమతులతో పాటు పాల్గొనే ప్రతివిద్యార్థికీ సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని ప్రకటించారు. అంతకుముందు విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. చైర్మన్ క్రీడల్లో పాల్గొని విద్యార్థులు, అధ్యాపకుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమాల్లో డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రామ నర్సింహారెడ్డి, ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ శ్రీరామచంద్, ఏవో రామారావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి గొంటి రమేశ్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బ మల్లన్నస్వామి ఆలయంలో మున్సిపల్ చైర్మన్ పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కుటుంబ సభ్యులు

జమ్మికుంట, డిసెంబర్ 4: మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బ మల్లికార్జున స్వామిని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కుటుంబ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఆలయ కమిటీ, అర్చకుల ఆధ్వర్యంలో చైర్మన్, కుటుంబ సభ్యులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మొక్కులు చెల్లించుకున్న తర్వాత శాలువా కప్పి సన్మానించారు. తర్వాత చైర్మన్ మాట్లాడుతూ.. ఆలయానికి గొప్ప చరిత్ర ఉందని, మల్లికార్జున స్వామిని దర్శించుకోవడం వల్ల కోరిన కోర్కెలు తీరుతాయని తెలిపారు. మల్లన్న స్వామి ఆలయం అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీని అభినందించారు. అలాగే ఆలయంలో కొత్తగా కొలువుదీరిన పంచలోహ విగ్రహాలతో తయారు చేసిన శ్రీమల్లికార్జునస్వామి సహిత గొల్ల కేతమ్మ, మేడలమ్మ అమ్మవార్లకు 3వ వార్డు కౌన్సిలర్ రవీందర్ కుటుంబ సభ్యుల నుంచి పుస్తెలు, మట్టెలు అందించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


వీణవంకలో వేంకటేశ్వరస్వామికి మొక్కులు చెల్లించి మాట్లాడుతున్న ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు

వీణవంక, డిసెంబర్ 4: పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంపై మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో, వల్భాపూర్ శివాలయంలో సింగిల్ విండో డైరెక్టర్ కామిడి కావ్య-శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. 101 కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అభ్యర్థిగా పాడి కౌశిక్‌రెడ్డిని ప్రకటించడంతో ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవాలని మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయానికి పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. వేంకటేశ్వరస్వామి, శ్రీరామచంద్రస్వామి ఆశీస్సులతో పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందారని ఆనందం వ్యక్తం చేశారు. ఆయన నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలు చేస్తూ ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కనపర్తి సర్పంచ్ పర్లపెల్లి రమేశ్, బీఆర్ఎస్ నాయకుడు కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.